సాక్షి
నారాయణపేట
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



జూరాలకు పెరుగుతున్న వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద శనివారం 2.10 లక్షల క్యూసెక్కులకు పెరిగింది.

-8లో ▸



క్రీడలహబ్‌గా మారుస్తాం

రాష్ట్రాన్ని క్రీడలహబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని టీఎస్ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి అన్నారు.

-8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /21.5

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

అనుమానాలెన్నో..?

యూరియా విక్రయాలు గణనీయంగా పెరగడంపై సందిగ్ధం

- జిల్లాకు అంచనా 10వేల మెట్రిక్ టన్నులు..
- ఇప్పటివరకు పంపిణీ చేసింది 15,060 మెట్రిక్ టన్నులు
- సరిపడా యూరియా దొరక్క రైతుల అవస్థలు
- సరిహద్దు రాష్ట్రం కర్ణాటకకు అక్రమంగా తరలిస్తుండగా ఇటీవల పట్టివేత



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి బండ్రవల్లికి చెందిన రైతు రాములు. ఇతను కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద పది ఎకరాల్లో వరి సాగు చేశాడు. 25 బస్తాల యూరియా అవసరం ఉండగా.. తీలేరు సొసైటీకి ఇప్పటివరకు ఆరుసార్లు వచ్చాడు. కానీ, టోకెన్ మాత్రం దొరకలేదు. ఈక్రమంలో యూరియా అయిపోయిందంటూ చెబుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తమకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

నారాయణపేట: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. గంటల తరబడి నిరీక్షిస్తు న్నా.. యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు గాసిన క్యూలో వారి లైన్ వచ్చేసరికి యూరియా దొరకకా వెనుదిరుగాల్సిన పరిస్థితులు నెలకొంటు న్నాయి. యూరియా వచ్చిందనే తెలిస్తే చాలు రైతులు ఒక్కసారిగా అగ్రోస్, పీఏసీఎస్‌ల వద్దకు పరుగులు తీస్తున్నారు. రోజుల తరబడి ఎండనకా.. వాననకా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనగా.. కొన్ని చోట్ల ఆగ్రహం కట్టలు తెంచుకొని రైతులు ఆందోళనకు దిగుతున్నారు.

సరిహద్దు మండలాల నుంచి

నారాయణపేట, మక్తల్, ఊట్కూర్, మాగనూర్, క్రిష్ణ, దామరగిద్ద, మద్దూర్ మండలాలు కర్ణాటకకు సరిహద్దుల్లో ఉన్నాయి. ఇటు తెలంగాణ, అటు కర్ణాటక రాష్ట్రాల్లో ఎరువుల ధరల్లో వ్యత్యాసం ఉండడంతో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటూ అక్రమ రవాణా జరుగుతుండటం ఈ ప్రాంతంలో పరిపాటి. ధరల్లో వ్యత్యాసం కారణంగా కర్ణాటకకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న ఘటనలు న్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు మండలాల్లో సాగు విస్తీర్ణం పెరగకపోయినా యూరియా విక్రయాలు అధికంగా కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మద్దూరులో యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు (ఫైల్)

రైతులకు తప్పని నిరీక్షణ

జిల్లాలోని పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందంటే చాలు తెల్లారేసరికి రైతులు తమ పట్టా పాసుపుస్తకాలను పట్టుకొని క్యూలో గంటల తరబడి నిల్చుంటున్నారు. ఓ వైపు యూరియా అవసరమైన మేర ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా.. మరో వైపు యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు అన్ని ఇన్ని కావు. ఒకానొక సమయంలో అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగుతున్నారు.

5వేల మె.టన్నులు అధికంగా విక్రయాలు

కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మండలాల్లో యూరియా విక్రయాలు ఈ సీజనులో గణనీయంగా పెరగడంతో వ్యవసాయ శాఖ అధికారుల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. గతేడాది వానాకాలం సీజనుతో పోలిస్తే ఈ ఏడాది 5 వేల మెట్రిక్ టన్నులు అధికంగా విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం ఏమైనా రెట్టింపు అయ్యిందంటే కాలేదు. వరి సాగు మాత్రం ఈ ఏడాది 10 వేల ఎకరాలకు అధికంగా అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మిగతా పంటలు గతేడాది స్థాయిలో సాగు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

4 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో వివిధ పంటలు 4 లక్షల ఎకరాలు సాగు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. అందులో 1.76 లక్షల ఎకరాలు వరి, 70 వేల ఎకరాలు కంది, 1.80 లక్షల ఎకరాల పత్తి, మిగతా పంటలు మరో 15 వేలు ఉండొచ్చు. ఈసారి మొత్తం 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని ముందుగా వ్యవసాయ శాఖ అంచనా వేసినప్పటికీ.. అంతకు మించి 15,031 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ కావడం గమనార్హం.

తెల్లవారుజామున వచ్చా..



మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ఇప్పటివరకు తీలేరు సొసైటీకి వచ్చిన ప్రతిసారి యూరియా దొరకడం లేదు. మరికల్ ఫర్టిలైజర్ దుకాణాలకు అడిగినా లేదంటున్నారు. తీలేరు సొసైటీకి 600 బస్తాల వచ్చిందని తెలుసుకొని తెల్లవారుజామున 3 గంటలకు వచ్చిన. కానీ, ఒక బస్తా యూరియా దక్కకపోవడంతో నిరాశతో వెనుతిరిగా. – అంజనేయులు, రైతు, పూసల్‌పహాడ్

సరిహద్దులో ప్రత్యేక నిఘా




సరిహద్దు మండలాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. జిల్లాలో రైతులు సాగుచేసిన పంటలకు సరిపడే యూరియా కంటే 5 వేల మెట్రిక్‌టన్నులు అధికంగానే సరఫరా చేశాం. రైతులు తమకు అవసరానికి మించి ఎరువులు వాడుతున్నారు. గ్లోబల్ ప్రచారంతో యూరియా లభిస్తుందో లేదోనసే పంట కాలం మొత్తానికి కావాల్సిన యూరియాను కొనుగోలు చేస్తున్నారు. రైతులు తమకు అవసరమైనంత యూరియా కొనుగోలు చేయాలి. యూరియా పక్కదారి పట్టిస్తే ఫర్టిలైజర్ డీలర్లపై చర్యలు తప్పవు. – జాన్ సుధాకర్, డీఏఓ

మృత్యు శకటాలు..!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రైలు ఢీకొన్న ప్రమాదాలు

- ఏడాదిన్నరలో 130 ఆత్మహత్యలు.. 109 మంది ప్రమాదవశాత్తు మృతి
- బలవన్మరణాల్లో యువతే అధికం
- కట్టడికి దృష్టి సారించిన రైల్వే పోలీసులు



మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఇటీవల రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చదువులో రాణించ లేక విద్యార్థులు.. చెడు వ్యసనాలు, ఉద్యోగాలు రాలేదని, పెళ్లిళ్లు కాలేదంటూ యువత.. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో వివాహితులు.. ఇలా మనస్తాపంతో ఎందరో అర్ధాంతరంగా తనువు చాలిస్తూ ఆప్తులకు తీరని శోకం మిగులుస్తున్నారు. రైలు పట్టాలపై ప్రాణాలు తీసుకుంటున్న వారిలో అధికంగా 20 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వారే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో రాజాపూర్ నుంచి దేవరకద్ర మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్‌లపైనే అత్యధిక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో ఇతర జిల్లాల నుంచి వచ్చి ఈ ప్రాంతంలో ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు సైతం ఉన్నాయి. గద్వాల నుంచి అలంపూర్ మధ్య ఉన్న ట్రాక్‌పై కూడా ఇలాంటి అనేకం చటు చేసుకున్నాయి.

■ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొత్తూర్, రాజాపూర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మదనాపురం, గద్వాల, అలంపూర్ స్టేజీ మీదుగా సికింద్రాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూర్ తదితర ప్రాంతాల రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకొని బాధితులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. మరికొందరు రైళ్లు వచ్చే సమయంలో పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతున్నారు. యువకులు కదులుతున్న రైళ్లలో వేలాడుతూ ప్రయాణం చేస్తూ కిందపడిపోతున్నారు. సెల్ఫీ మోజులో ఫొటోలు తీసుకుంటూ ప్రమాదాలకు గురవుతున్నవారు ఉన్నారు.



రైల్వే పట్టాలపై మృతదేహం (ఫైల్)

ఏడాది వారీగా నమోదైన రైలు ప్రమాదాలు

ఏడాది	ప్రమాదవశాత్తు మరణాలు	ఆత్మహత్యలు	సహజ మరణాలు
2024	67	85	11
2025	42	45	6

mahabubnagar

జడ్చర్ల - దేవరకద్ర నడుమ..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి దివిటిపల్లి మధ్యలో అప్పన్నపల్లి, ఎస్వీఎస్ వైద్య కళాశాల వెనుకభాగం, లక్ష్మీనగర్‌కాలనీ, పిల్లలమర్రి రోడ్, మోతీనగర్, టీడీగుట్ట, వీరన్నపేట, పాలమూరు యూనివర్సిటీ ఎదుట, మాచన్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపం, మన్యంకొండ, దేవరకద్ర సమీపంలో రైళ్ల కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇందులో అధికంగా పాలమూరు పట్టణంలో ఉండటం విశేషం. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి రైళ్ల కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నా..

రైళ్ల కిందపడి బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య కట్టడి చేయడానికి రైల్వే పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా రైలు పట్టాల సమీపంలో కనబడితే వెంటనే వారి వద్దకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.

క్షణికావేశం సరికాదు..



జిల్లాలో జరుగుతున్న ఆత్మహత్యల్లో అధికంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, చదువులో రాణించకపోవడం వంటి కారణాలతోనే జరుగుతున్నాయి. ఆత్మహత్యల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా పట్టాలపై అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ఇలాంటి వారిని జిల్లాలో చాలా వరకు గుర్తించాం. – రాజా, రైల్వే ఎస్ఐ, మహబూబ్‌నగర్

తల్లిదండ్రుల పాత్ర కీలకం..

చిన్న చిన్న సమస్యలకు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులతో చర్చించుకోవాలి. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. ఇది చిన్న వయస్సు వారిలో అంతగా అర్థం కాదు. 20 నుంచి 30 ఏళ్లలోపు వారిలో హార్మోన్లు ఎక్కువగా పెరుగుతాయి. అన్నీ సాధిస్తామని అనుకుంటారు.. చిన్న చిన్న సమస్యలు వచ్చినా తట్టుకోలేరు. ఎక్కువ మంది ఆకర్షణకు లోనై అనుకున్నది సాధించలేనప్పుడు ఆత్మహత్యల వరకు వెళ్తుంటారు. మరికొందరు మత్తు పదార్థాలకు బానిసై ఆత్మహత్య చేసుకోవాలని చూస్తుంటారు. ఇలాంటి వారిపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. – డా. అనిల్‌రాజ్, మానసిక వైద్యుడు

కుటుంబ సభ్యుల చొరవతోనే..

ఓటమిని అంగీకరించకపోవడం, సున్నిత మనస్తత్వం, ఒంటరితనాన్ని అలవాటు చేసుకోవడం, సమస్యలు వినేవారు లేకపోవడం వంటి కారణాలతో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. అయితే వారిలో ఆత్మహత్య ఆలోచనను దూరం చేయాలంటే కుటుంబ సభ్యులే చొరవ చూపాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. అలాంటి వారి వ్యవహార శైలిని నిత్యం గమనిస్తూ ఉండాలి. ఏదైనా అనుమానం వస్తే మందలించకుండా.. 'ఎలాంటి సమస్య ఉన్నా అండగా ఉంటాం' అనే భరోసా కల్పించాలి. మానసికంగా కుంగిపోతే వైద్యులను సంప్రదించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ ఇప్పించాలి.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి అసెంబ్లీ సమావేశాలకు మంత్రి హోదాలో వెళ్తున్న సందర్భంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాలసదనం చిన్నారులకు దుస్తుల అందజేత



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్ వద్ద గల బాలసదనం చిన్నారులకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. శనివారం సదనంలో 48 మంది అనాథ చిన్నారులకు కలెక్టర్ తన నిధులతో స్పోర్ట్స్ డ్రెస్‌లు, ఆట వస్తువులను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్ తో కలిసి పంపిణీ చేశారు. చిన్నారులకు కరాటే శిక్షణ, కూచిపూడి నృత్యం నేర్పించాలని డీసీపీఓ కరిష్మా ను ఆదేశించారు. అనంతరం సదనం పక్కనే ఉన్న వయోవృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు వృద్ధులకు చీరలను పంపిణీ చేసిన కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కోస్గి డిపోకు 16మంది కేటాయింపు

నారాయణపేట రూరల్: సీఎం సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ డిపోలో సిబ్బంది కొరత ఉండడంతో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చొరవ తీసుకొని 16 మంది సిబ్బందిని కేటాయించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ డిపోల్లో జూనియర్లుగా ఉన్న 8 మంది డ్రైవర్లు, మరో 8 మంది కండక్టర్లను ఎంపిక చేసి వారిని కోస్గి డిపోకు కేటాయిస్తూ ఆర్టీసీ పీఓ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే వారు విధుల్లో చేరాలని ఆదేశించారు.

దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట: రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖచే ట్రైకార్ ఎస్టీ కార్పొరేషన్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 105 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ గిరిజన యువత కోసం డీడీయూ – జీకేవై పథకం కింద ఉచిత శిక్షణ, వసతితో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టాలి, కంప్యూటర్ హార్డ్‌వేర్, టూవీలర్ సర్వీసింగ్, సోలార్ ఇన్‌స్టలేషన్ తదితర వాటిపై విద్యార్హతను బట్టి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల లోపు యువకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో యాదాద్రిభువనగిరి జిల్లా జలాల్‌పూర్‌లోని స్వామిరామానంద తీర్థ గ్రామీణ సంస్థలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు



దామరగిద్ద: నానో యూరియా,డీఏపీ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంఏఓ మణిచందర్ సమక్షంలో రైతులతో సమావేశమై నానో ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. నానో ఎరువులను పంటలపై పిచికారీ చేయడం వల్ల పంట మొక్కల ఆకు ద్వారా మొక్కకు చేరుతుందన్నారు. వరి పత్తి, కూరగాయల పంటలపై ఒక లీటరు నీటికి 4 మిల్లీ లీటర్ నానో యూరియాను కలిపి పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. నీరు, గాలి కాలుష్యం తగ్గి పర్యావరణ హితానికి దోహదం చేస్తుందన్నారు. సాధారణ ఎరువుల నేలలో చల్లడం వల్ల వృథా ఎక్కువగా ఉంటుందని, నానో యూరియా వాడకంతో మొక్కల్లో నత్రజని వినియోగ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. రైతులు నానో వినియోగాన్ని పెంచాలని సూచించారు.

యూరియా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు



తీలేర్ సొసైటీ వద్ద ఏఓతో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

మరికల్: యూరియా పంపిణీ చేసే కేంద్రాల వద్ద ఎలాంటి ఆటంకాలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సిబ్బందికి సూచించారు. మరికల్ మండలం తీలేర్ సొసైటీ వద్ద జరిగిన ఘటన నేపథ్యంలో ఎస్పీ అక్కడికి చేరుకొని రైతులతో, యూరియా నిల్వలపై ఏఓ రహ్మాన్‌తో వేర్వేరుగా ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉదయం నుంచి యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు వచ్చారని, ఇక్కడే జాతీయ రహదారి ఉండటంతో రోడ్డుపై క్యూలో ఉన్న రైతులకు ప్రమాదం జరగకుండా స్థానిక ఎస్ఐ టోకెన్లు ఇస్తుండగా ఆయనపైకి రైతులు గుమిగూడి వచ్చారన్నారు. ఈక్రమంలో పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు ఓ రైతుపై చెయ్యి లేపాడని, ఈ విషయంపై బాధిత రైతు కూడా తనతో మాట్లాడటం జరిగిందన్నారు. తీలేర్ సొసైటీలో యూరియా లేదని పుకార్లు రావడంతో రైతులు అధికసంఖ్యలో యూరియా కోసం వచ్చారని, ఈక్రమంలోనే తోపులాట జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా యూరియా పంపిణీ చేసే కేంద్రాల వద్ద ముందు జాగ్రత్త చర్యలు కింద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ విషయంపై కలెక్టర్‌తో కూడా చర్చించామన్నారు. జరిగిన ఘటనపై ఎస్ఐపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి: ఎస్పీ

నారాయణపేట/ఊట్కూరు: గణేశ్ నిమజ్జనంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని ఎస్పీ ఆదేశించారు. శనివారం ఊట్కూరులో వినాయక శోభాయాత్ర మార్గాన్ని ఎస్పీ పరిశీలించారు. మెయిన్‌బజార్, పంచ్‌మజీద్, బస్టాండ్, శివాజీనగర్ తదితర ప్రాంతాలన్ని కలియ తిరిగారు. భవాని మందిర్‌లోని వినాయకుడి దగ్గర ప్రత్యేక పూజలు చేపట్టారు. శాంతియుతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. సీఐ రామ్‌రాజు, నాయకులు అరవింద్‌కుమార్, సూర్యప్రకాష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నిర్సంహారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ప్రత్యేక పూజలు

జిల్లా కేంద్రంలోని దూల్‌పేట గణేష్ మందిరంలో శనివారం ఎస్పీ యోగేష్ గౌతమ్, బీజేపీ సీనియర్ నేత నాగురావు నామాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ అంశాలను విద్యార్థులకు వివరించాలి



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ అనే అంశంపై మూడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించారు. శనివారం చివరిరోజు సమావేశానికి స్థానిక ఎంఈఓ బాలాజీ, ఏఎంఓ విద్యాసాగర్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వినోద్ హాజరై మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న పాఠ్య ప్రణాళిక చిత్రానికి అనుగుణంగా అవసరమైన డిజిటల్ సామర్థ్యాలతో విద్యార్థులను సాధికార పరచడంలో ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. నూతనంగా 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సిటిజెన్షిప్‌తో పాటు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైతిక తార్కికం తదితర అంశాలు ఉన్నాయని చెప్పారు. డాటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోడింగ్ డిజైన్ థింకింగ్ డిజిటల్ టెక్నాలజీ అనే అంశాలపై ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 19 పీఎం శ్రీ పాఠశాలల నుంచి 83 మంది సైన్స్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్నటువంటి విషయాలన పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్, నారాయణ, ప్రవీణ్, తిప్పన, భాస్కర్, మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపల్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరుతూ ఏబీవీపీ, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు, విద్యార్థులు వేరువేరుగా ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ మేరకు నాయకులు గ్రామం నుంచి ర్యాలీగా వచ్చి ఆర్టీసీ డిపోకు చేరుకొని వినతిపత్రం అందించారు. అదేవిధంగా ఏబీవీపీ నాయకులు స్థానిక బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నరేష్, సతీష్, వివేకానంద, చరణ్ రెడ్డి, ఇంతియాజ్, మహిపాల్, వికాస్, గోవిందు, జైపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే చనిపోయిందని కుటుంబీకుల ఆందోళన


సుభద్రమ్మ (ఫైల్)

కొల్లాపూర్ రూరల్: ఛాతీలో నొప్పితో బాధపడుతూ ఓ ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. కొల్లాపూర్ మండలం జవాయిపల్లికి చెందిన సుభద్రమ్మ (60)కు శుక్రవారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబీకులు ఎన్మన్‌బెట్ల గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆమెకు చికిత్స అందిస్తున్న క్రమంలో నొప్పి మరింత ఎక్కువ కావడంతో కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించాలని ఆర్‌ఎంపీ సూచించాడు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై కొల్లాపూర్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమె ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. అయితే ఆర్‌ఎంపీ ఎక్కువ డోస్‌తో సూది మందు ఇవ్వడంతోనే సుభద్రమ్మ మృతిచెందిందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆర్‌ఎంపీ, అతడి క్లీనిక్, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడగా.. స్థానికులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త చిన్నస్వామి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ శంషోద్దీన్ కథనం ప్రకారం.. మర్రిపల్లికి చెందిన అంగోతు దాస్యనాయక్ (55) శుక్రవారం వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లి రాత్రి 11గంటల సమయంలో రోడ్డు దాటి ఇంటికి వెళ్తుండగా.. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో దాస్యనాయక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య బుజ్జి, నలుగురు పిల్లలు ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నూర్ అహమ్మద్(50) అనే వ్యక్తి మరణించాడు. కర్నూల్ జిల్లా దొడ్డిపాడుకు చెందిన నూర్ అహమ్మద్ అలంపూర్ చౌరస్తా నుంచి శాంతినగర్ మీదుగా సబ్‌స్టేషన్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందగా భార్య పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గురుకుంట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. శనివారం మండల కేంద్రానికి చెందిన సిద్దటం కేశవులు (35) పని నిమిత్తం దరిపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి నవాబుపేటకు వస్తూ ప్రమాదవశాత్తు గురుకుంట సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా అటుగా వెళుతున్న వారు గమనించి 108లో ఆసుపత్రికి తరలించారు. అయితే క్షతగాత్రుడు మార్గమధ్యలోనే మృతి చెందాడు. కేశవులకు భార్య లావణ్యతో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

జూరాలకు పెరుగుతున్న వరద



- 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- 24 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 24 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,70,064 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు చెప్పారు. విద్యుదుద్పత్తి నిమిత్తం 32,567 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 46, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 400, సమాంతర కాల్వకు 400 క్యూసెక్కులు దిగువన శ్రీశైలం జలాశయానికి చేరినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.929 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

12 యూనిట్లు.. 474 మెగావాట్లు..

జూరాల దిగువ, ఎగువ కేంద్రాల్లోని 12 యూనిట్ల ద్వారా శనివారం విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 262.177 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 292.281 మి.యూ. ఉత్పత్తి జరిగిందన్నారు. ఇప్పటి వరకు 554.458 మి.యూ. విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

సుంకేసులకు పెరిగిన వరద..

సుంకేసుల జలాశయానికి శనివారం ఎగువ నుంచి 59 వేల క్యూసెక్కుల వరద చేరినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. దీంతో 13 గేట్లు ఒక మీటర్ మేర తెరిచి 56,485 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

సరళాసాగర్ జలాశయం..

మండలంలోని సరళాసాగర్ జలాశయం నుంచి శనివారం దిగువకు వరద కొనసాగింది. కేవలం ఒక ప్రైమరీ సైఫన్ మాత్రమే తెరుచుకుంది.

రామన్‌పాడు నుంచి నాలుగు వేల క్యూసెక్కులు..



ఊకచెట్టు వాగుతో పాటు ఎగువ నుంచి శనివారం రామన్‌పాడు జలాశయానికి వరద కొనసాగింది. మొత్తం 6 వేల క్యూసెక్కులు జలాశయానికి చేరగా.. ఒక గేట్ ఎత్తి4,600 క్యూసెక్కులు దిగువకు వదిలారు.

శ్రీశైలంలో 6 గేట్లు ఎత్తివేత

అచ్చంపేట రూరల్: శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో జూరాల స్పిల్ వే నుంచి 1.69 లక్షలు, విద్యుదుత్పత్తి నుంచి 32,512, సుంకేసుల నుంచి 48,532 క్యూసెక్కులు మొత్తం 2,52,567 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు ఆరు క్రస్టు గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 1,59,912 క్యూసెక్కులు, ఎడమ, కుడి గట్టు భూగర్భ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి 65,240 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 881.90 అడుగల వద్ద 198.3623 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి


100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

- టీఎస్ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రాన్ని క్రీడలహబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుదని టీఎస్ క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి రాజేంద్రప్రసాద్ స్మారక అథ్లెటిక్స్ పోటీలను పీయూలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రారంభోత్సవానికి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో త్వరలో రూ.11కోట్ల అంచనాతో సింథటిక్ ట్రాక్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు ధైర్యాన్ని కోల్పోకుండా క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రభుత్వం క్రీడాపాలసీని అమలు చేస్తుందని, గతంలో ప్రపంచ స్థాయి మెడల్ సాధిస్తే కేవలం రూ.2లక్షలు ఇచ్చే వారని, ప్రస్తుతం దాన్ని రూ.కోటికి పెంచారని, ఇటీవల మెడల్ సాధించిన జీవాన్జీ దీప్తికి నగదును అందించారని పేర్కొన్నారు. 157 ఈవెంట్స్‌కు వివిధ జిల్లా నుంచి 1,115 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఎస్పీ వెంకటేశ్, మాజీ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రాజేశ్, సారంగపాణి, శరత్‌చంద్ర, డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ఫలితాలు

బాలికల అండర్-18 విభాగం 3వేల మీటర్ల వాక్‌లో జె.పండు, ముస్కాన్, రిషికారాథోడ్, అండర్-20 విభాగం 5వేల మీటర్లలో వరలక్ష్మి, ఉషారాణి, నందిని, బాలుర అండర్- 20 విభాగం 10వేల మీటర్ల వాక్‌లో గణేశ్, జశ్వంత్, అబ్దుల్ కరీం, అండర్-14 విభాగం జావలిన్‌త్రోలో జకేశ్, అనురాగ్ పాటిల్, కరుణ్‌దేవ్, బాలుర అండర్-20 విభాగం 5వేల మీటర్ల పరుగులో చౌదరి మోహిత్, అశోక్‌రాథోడ్, ధోని, అండర్-18 బాలుర విభాగం డిస్కస్‌త్రోలో సునీత్‌కుమార్, వరుణ్‌గౌడ్, అజేంద్ర, బాలుర- 5వేల మీటర్ల వాక్‌లో రణధీర్, అన్వేశ్, బద్దునాయక్ మొదటి మూడు స్థానాలను గెలుచుకున్నారు.

వాయిదా పడిన వేలంపాట


వేలం పాటలో పాల్గొన్న ఆలయ సిబ్బంది

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయం వద్ద శనివారం నిర్వహించిన కొబ్బరికాయలు, పూలు, పూలదండలు, పూజా సామగ్రి, వాహనపూజ సామగ్రికి సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాటలు వాయిదా పడ్డాయి. వేలం పాటలో సరైన హెచ్చు పాట రానందున వాయిదా వేసినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి తెలిపారు. త్వరలోనే వాటికి వేలం పాటలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే జాతర ఉత్సవాల్లో స్వామివారికి నైవేద్యం సమర్పించే దాసంగం కుండలకు కూడా వేలం పాటలు నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ఆలయ చైర్మన్, ఈఓలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భారతి, నాగరాజు, కమలాకర్, భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

'శూన్యం' కవిత్వానికి జాతీయ పురస్కారం


అరుణ్‌కుమార్

కందనూలు: జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత ఫిజిక్స్ అరుణ్‌కుమార్ రచించిన 'శూన్యం' పుస్తకం గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే వేడుకల్లో ఫౌండేషన్ అధ్యక్షురాలు, గిడుగు రామమూర్తి మునిమనుమరాలు కాంతికృష్ణ, కళారత్న డా.బిక్కి కృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, విమల సాహితీ సంస్థ అధ్యక్షుడు డా.జెల్ది విద్యాధర్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ తదితరుల చేతుల మీదుగా అరుణ్‌కుమార్ జాతీయ పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తొలి కవిత్వ పుస్తకానికి జాతీయ స్థాయిలో పురస్కారం రావడం వల్ల సామాజికంగా తన బాధ్యత మరిత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో శాస్త్రీయతతో కూడిన, సమాజంలో దేశభక్తిని పెంచే మానవీయ కోణంలో రచనలు చేస్తానని.. శూన్యం పుస్తక రచనకు సహకరించిన వారికి, పురస్కారం ప్రకటించిన గిడుగు ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాగా, సైంటిస్టు శ్రీనివాస్, నవ్య కిరణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, డా.అమ్మిన శ్రీనివాసరాజ్, స్రవంతి సంతోష్, ఎల్లన్న, నారాయణ, రాజేశ్ తదితరులు అరుణ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

కారు బోల్తా : ముగ్గురికి గాయాలు

వెల్దండ: మండలకేంద్ర సమీపంలో వీజేఆర్ హోటల్ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం అదుపుతప్పి కారు బోల్తా పడడంతో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు బయలుదేరిన మన్సూర్, భార్య రెస్మాన్‌బేగం, కుమారుడు ముసాధీర్‌లు కారులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పిన కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నపిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి


ఆత్మకూరు-పెబ్బేరు బైపాస్ రోడ్డులో కలెక్టర్ ఆదర్శ్‌సురభి, జిల్లా జడ్జి సునీతతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి అనిల్‌కుమార్ జూకంటి

హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌ఎస్‌జే అనిల్‌కుమార్ జూకంటి

వనపర్తి: చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌ఎస్‌జే అనిల్‌కుమార్ జూకంటి అన్నారు. శనివారం వనపర్తికి వచ్చిన ఆయనకు కలెక్టర్ ఆదర్శ్ సురభి సాదరంగా ఆహ్వానం పలికారు. కలెక్టర్‌తో న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్నపిల్లల రక్షణ భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్, జిల్లా జడ్జితో కలిసి నాగవరం శివారులో సర్వే నంబర్ 200 లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిత ఆత్మకూరు-పెబ్బేరు బైపాస్ రోడ్డును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను కొంత మార్చాల్సిందిగా సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి వెంట జిల్లా జడ్జి యం.ఆర్.సునీత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్, సీనియర్ సివిల్ జడ్జిలు కళార్చన, రజనీ, అశ్విని, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, రోడ్లు భవనాల ఇంజనీరు దేశ్యానాయక్ తదితరులు హైకోర్టు న్యాయమూర్తి వెంట ఉన్నారు.

భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచి భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. పీయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో విద్యార్థి ఇంజినీరింగ్‌లో చేరితే నేరుగా ఉద్యోగం వచ్చినట్లు భావించేవారని, ఇప్పుడు సీటు వచ్చినంత మాత్రాన ఉద్యోగం సాధించే పరిస్థితి లేదన్నారు. ఇంజినీరింగ్‌లోని కొన్ని డిపార్ట్‌మెంట్లలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ అక్కడ ఉన్న పోటీని తట్టుకుని నిలబడి మంచి స్కిల్స్ సాధించిన వారికే ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. మొదటి సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు కష్టపడి చదివితే జీవితంలో స్థిరపడేందుకు అవకాశం ఉందని, కళాశాల స్థాయిలో చదవకుంటే జీవితాంతం కష్టపడాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని బాగా చదవాలన్నారు. యూనివర్సిటీలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు వినియోగించుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను సెమినార్లు, ఇంటెన్సీ ప్రోగ్రాంలు, వర్క్‌షాప్స్, మినీ ప్రాజెక్టుల రూపంలో మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అధ్యాపకులు చంద్రకిరణ్, గౌస్‌మోహినొద్దీన్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, రవికాంత్, కరుణాకర్‌రెడ్డి, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు వరప్రదాయిని ఐఐఐటీ


మాట్లాడుతున్న ఐఐఐటీ బాసర వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్


ఐఐఐటీ కళాశాల పాలమూరు వరప్రదాయినిగా మారనుందని బాసర ట్రిబుల్‌ఐటీ కళాశాల వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ట్రిబుల్‌ఐటీ కళాశాల విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ సీట్లు పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉత్తమమైన అధ్యాపకులను నియమించామని, ఐఐఐటీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నతంగా ఎదిగారని చరిత్ర చెబుతుందని, ఇక్కడ చేరిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రొఫెసర్ మురళి దర్శన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ప్రతిభకు పెద్దపీట వేస్తుందని, ఇక్కడ చదివే విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తున్నాయని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల నుంచి ఐఐఐటీ పుట్టిందని చెప్పారు. పాలమూరుకు ఐఐఐటీ కళాశాలను మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాసర ఐఐఐటీ డీన్ విఠల్, సైకాలజిస్టు శ్రీనివాస్, లోహిత్‌రాజ్, రవీందర్, శివశంకర్, శోభ, రాఘవి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వచ్చిన వృద్ధురాలిపై దాడి



మానవపాడు: పింఛన్ కోసం వచ్చిన ఓ వితంతు వృద్ధురాలిపై పోస్ట్‌మేన్ దాడి చేసిన ఘటన మండలంలోని చెన్నిపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పింఛన్‌దారులు, గ్రామస్తుల కథనం మేరకు.. మానవపాడు మండలంలోని చెన్నిపాడుకు పద్మావతి అనే వితంతు మహిళ పింఛన్ కోసం చెన్నిపాడులోని పోస్టాఫీస్‌కు వెళ్లారు. అయితే పోస్టుమాన్ లైన్లో నిలబడినా లైన్‌లో నిలబడ లేదని పద్మావతిపై దాడి చేశాడు. దాడి చేయడమే కాకుండా గట్టిగా మాట్లాడితే వచ్చే నెల పింఛన్ ఇవ్వనని బెదిరించినట్లు బాధితురాలు వాపోయారు. ఈ ఘటనపై మానవపాడు పోస్టుమాస్టర్ రామనాథ్‌రెడ్డిని వివరణ కోరగా తన దృష్టికి రాలేదని తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలని నిరసన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ శని వారం విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. 8 తరగతులకు 5మంది మాత్రమే ఉపాధ్యాయుల ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గణితం, ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడిని వివరణ కోరగా ఉపాధ్యాయుల కొరత ఉన్నమాట వాస్తవమే. ఈ ఏడాది 8వ తరగతి ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఒక్కరు పదవీ విరమణ పొందడం, మరో ఇద్దరు పదోన్నతిపై వెళ్లడంతో సమస్య తలెత్తింది. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంరక్షణ చర్యలు.. తెగుళ్ల నివారణ

వర్షాలకు పంటలను చీడపీడలు ఆశించే అవకాశం

- పాతనీటిని తీసివేస్తే మేలంటున్న శాస్త్రవేత్తలు



మహబూబ్‌నగర్ రూరల్ మండలం పోతన్‌పల్లిలో సాగైన వరి, పత్తిపంట

పాడి-పంట
డా.అర్చన, వ్యవసాయ శాస్త్రవేత్త

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలో వారం, పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట చేలలో నీరు నిలవడం, నాటిన నారు కొట్టుకుపోవడం వంటి సమస్యలు చోటుచేసుకుంటున్నాయి. రైతులు పంటలను కాపాడుకోవడానికి తగు సంరక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త, శాస్త్రవేత్త డాక్టర్ అర్చన సాక్షితో తెలిపారు. కొన్నిరోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో వివిధ పంటల్లో కొన్ని రకాల చీడపీడల ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో ప్రస్తుతం కొన్ని రకాల చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. అందుకు సంరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు.

- భారీనుంచి అతిభారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో రైతులు వరినాట్లు లేదా నేరుగా దమ్ము చేసుకొని విత్తుకోవడం తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి.
- ప్రస్తుతం స్వల్పకాలిక వరి రకాలను మాత్రమే (120-125రోజుల) దమ్ము చేసి నేరుగా విత్తుకునే పద్ధతి ద్వారా ఆగస్టు నెలాఖరు వరకు సిఫార్సు చేసిన నీరు, కలుపు యాజమాన్య పద్ధతులు ఉపయోగించుకొని విత్తుకోవాలి.
- నీటి ముంపునకు గురైన వరి పాలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం ఆశించుటకు అనుకూలం. ఈ దుష్ప్రభావం గమనించిన వరి పంటలో మొక్క వేర్లకు తగినంత గాలి తగిలే విధంగా మురుగు నీటిని తీసివేయాలి. అదేవిధంగా పొలాన్ని సన్న నెర్రలు వచ్చే వరకూ ఆరబెట్టి మళ్లీ నీరివ్వాలి.
- నీరు ఆలస్యంగా వచ్చి దీర్ఘకాలిక వరిరకాల నారు నాటుపెట్టుకోవడం ఆలస్యమైన ప్రాంతాల్లో 50రోజుల వయస్సున్న నారు ఆకు చివరలను త్రుంచివేసి కుదురుకు 5 నుంచి 6మొక్కల చొప్పున, చదరపు మీటరుకు 66మొక్కలు ఉండేవిధంగా 15ఇన్‌టు10దూరంలో నాటువేయాలి.
- కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు ఆశించకుండా వరి పొలం గట్లను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- 25-30 రోజుల వయసు ఉన్న వరినారును ఉపయోగించుకొని ఈనెలాఖరు వరకు నారు పెట్టుకోవచ్చు.

పత్తి పంటలో..

- ప్రస్తుతం పత్తి పంట శాకీయ దశనుంచి పూత పిందె, కాయ అభివృద్ధి చెందే దశలో ఉంది.
- ముంపునకు గురైన పత్తి పంటలో వడ తెగులు ఆశించడానికి అనుకూలం. కావున మురుగు నీటిని పొలం నుంచి తీసివేసి, వర్షం తగ్గిన తర్వాత పంట త్వరగా కోలుకోవడానికి పాలిఫీడ్ (19:19:19) లేదా మల్టీ -కే (13-0-45) లేదా 10 గ్రా. యూరియా ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించుటకు 3గ్రాముల కాపర్- ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండిజమ్ ప్లస్ మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా 20రోజులు, 40రోజుల వయస్సు ఉన్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ దూరంలో పాదులు తీసి రసాయనిక ఎరువులను వేసి మట్టిలో కప్పాలి.

మొక్కజొన్న

- ప్రస్తుతం మొక్కజొన్న పంట శాకీయ దశ నుంచి కంకి, గింజ అభివృద్ధి చెందే దశలో ఉంది.
- మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు. కాబట్టి పొలం నుంచి నీటిని వెంటనే తీసివేయాలి.
- అధిక వర్షాలతో నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదరంగులోకి మారే అవకాశం ఉంటుంది. వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రాముల 19-10-19 లేదా 20 గ్రాముల డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20కిలోల యూరియా 15కిలోల పొటాష్‌ను వేసుకోవాలి.

కంది

ముంపుకు గురైన పంటలో ఫైటాప్తెర ఎండు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో వర్షం తగ్గిన తర్వాత నివారణకు 2 గ్రాముల మెటాలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

గణనాథ.. దీవించయ్యా


నారాయణపేటలో కొలువుదీరిన వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ కమిషనర్


మక్తల్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి దర్శనానికి విచ్చేసిన మహిళలు


నారాయణపేటలో ఏర్పాటు చేసిన లంబోదరుడికి పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నేత నామాజీ


శివలింగేశ్వర దేవాలయంలో గణనాథుడికి పూజలు చేయిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

పిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నారాయణపేట: లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని బోరం బావి దగ్గర ఉన్న వృద్ధాశ్రమం, బాలసదనం హోమ్‌ను ఆమె తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించి సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వసతులు, ఆహార ధాన్యాల నాణ్యత, తాగునీరు, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

బీపీఎం, ఫీల్డ్ అసిస్టెంట్, కార్యదర్శిను తొలగించాలి

మక్తల్: మండలంలోని ఖానాపూర్ ఉపాధిహామీ సిబ్బంది బీపీఎం, సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మక్తల్ ఎంపీడీఓ కార్యాలయం ముందు శనివారం ధర్నా చేశారు. ముగ్గురు ఒక్కటై కూలీల పేర్లపై డబ్బులు డ్రా చేసుకొని అవినీతికి పాల్పడుతున్నారన్నారు. కూలీల హాజరు, డబ్బుల చెల్లింపుపై ఆర్టీఐ యాక్ట్ కింద సమాచారం ఇవ్వాలని అడిగితే సమాధానం దాట వేస్తున్నారన్నారు. ముగ్గురు కలిసి రూ.లక్షల్లో కాజేశారని వెంటనే వారిని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచు వెంకటయ్యగౌడ్, సాయిరెడ్డి, నర్సింములు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



మక్తల్: ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని పీడీ శంకరయ్య సూచించారు. మండలంలోని గొల్లపల్లిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తుందన్నారు. కార్యక్రమంలో సురేశ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెస్ బోర్డులు అందజేత



మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలమూరు ఎన్నారై ఫోరం ప్రతినిధులు విద్యార్థులకు చెస్ బోర్డులను అందజేశారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఎన్నారై ఫోరం సహకారంతో యువక మండలి ఆధ్వర్యంలో 180 మంది విద్యార్థులకు చెస్ బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం ప్రతినిధులు రవి ప్రకాష్ రెడ్డి, మైపాల్‌రెడ్డి, ఎంఈఓ కలీం ఉల్లాఖ్, జీహెచ్ఎం నాగరత్నమ్మ, యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, అఖిలపక్షం నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, శేఖర్, హరీష్, వేణు, బసంత్‌లు పాల్గొన్నారు.

మద్దూరులో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు

మద్దూరు: పట్టణంలో విద్యుత్ అధికారులు నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని రా వులపల్లి రోడ్‌లోని ప్రాథమిక పాఠశాల నుంచి కోస్గి రోడ్‌లోని సినిమా థియేటర్ వరకు ఈ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 9.1 మీటర్ల వరకు 32 కొత్త విద్యుత్ స్తంభాలను, 11 కేవీ విద్యుత్‌లైన్‌తో పాటు గృహ వినియోగానికి మరో లైన్ ఏర్పాటు చేశారు. ఒకటే లైన్ ఉండడంతో ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 24 లక్షల వ్యయం అయిందని విద్యుత్ అధికారులు తెలిపారు.

విద్యుత్ తీగలు.. ప్రమాద ఘంటికలు

- ప్రమాదకరంగా కరెంట్ వైర్లు
- పొరపాటున తగిలితే షాక్‌కు గురయ్యే అవకాశం
- గణేష్ విగ్రహాల తరలింపునకు ఆటంకాలు

కోస్గి రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కరెంట్ తీగలు ప్రమాదకరంగా తయారయ్యాయి. పట్టణంలో ఏ విద్యుత్ స్తంభానికి చూసినా పై నుంచి కింది దాకా విద్యుత్ తీగలతో పాటు కేబుల్ వైర్లు వేలాడుతూ యమపాశాలుగా దర్శనమిస్తున్నాయి. నవరాత్రులు మొదలవడంతో మండపాలు ఏర్పాటు చేసే క్రమంలో ఇటీవల పలుచోట్ల ప్రమాద ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. హైదరాబాద్‌లో మండపం ఏర్పాటులో జరిగిన అపశృతిలో నలుగురు కరెంట్ షాక్‌కు గురై మరణించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలోని భాహార్‌పేట్, మామిళ్లవీదిలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు తగిలే అవకాశం ఉంది.

విద్యుత్ సిబ్బందికి ఇబ్బందే

ప్రధాన రహదారుల వెంట ఉన్నా స్తంభాలలో పాటు వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన అనేక రకాల కంపెనీల కేబుల్ వైర్లు, కరెంట్ తీగలు వేలాడుతూ చిక్కుముళ్లుగా ఉన్నాయి. ఇలాంటి చిక్కుముళ్ల వల్ల విద్యుత్‌శాఖ సిబ్బందికి కూడా ఇబ్బంది కరంగా మారింది. కరెంటు స్తంభంపై నుంచి వేలాడుతున్నా ఈ కేబుల్ వైర్లు పొరపాటున ప్రజలకు తగిలితే విద్యుత్ షాక్ తగిలి ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది.


నీలకంఠస్వామి దేవాలయం వద్ద ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


రామాలయం చౌరస్తా వద్ద..

సంబంధిత నెట్ కంపెనీ వారు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసి కేబుల్ వైర్లు ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ప్రమాదం లేకపోలేదనే చర్చ నడుస్తోంది. హైదరాబాద్‌లో చోటుచేసుకున్నా ఘటన తర్వాత కూడా కోస్గి పట్టణంలో సంబంధిత అధికారులు కేబుల్ వైర్ల తొలగింపుపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినాయక చవితి ఉత్సావాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్నా వైర్లను తొలగించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికే శాంతి సంఘం సమావేశంలో సీఐ, రెవెన్యూ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని కేబుల్ వైర్ల యజమానులను ఆదేశించినట్లు సమాచారం. అయితే సంబంధిత కేబుల్ యజమానులు కేబుల్ వైర్ల తొలగింపునకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

నోటీసులు జారీ చేస్తాం



వినాయక నిమజ్జన ఉత్సావాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ తీగలను చాలా వరకు తొలగించాం. ఇతర నెట్ కేబుల్ ఆపరేటర్లకు రెండు రోజుల్లో నోటీసులు జారీ చేస్తాం. విద్యుత్ స్తంభాలకు కాకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచిస్తాం. ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

–వెంకటేష్, విద్యుత్‌శాఖ ఏఈ, కోస్గి

కొనసాగుతున్న యూరియా కష్టాలు

కొత్తపల్లి: మండలంలో యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రానికి శనివారం 300 బస్తాల యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. దీంతో మండల వ్యవసాయ అధికారి రమేశ్ అక్కడికి చేరుకొని రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. సమయానికి యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి మండల బీఆర్ఎస్ నాయకులు రైతులకు సంఘీబావంగా అధికారులతో మాట్లాడారు. ప్రతి ఎరువుల దుకాణంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల నాయకులు

ఊట్కూరు: రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని బీజేపీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బిజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్‌కుమార్, మాజీ ఎంపిటిసి కిరన్, నాయకులు ఆశప్ప, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడి చేయడం హేయమైన చర్య

మరికల్: యూరియా కోసం వచ్చిన రైతులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా పార్టీ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం తీలేర్ సొసైటీ దగ్గర రైతులతో మాట్లాడిన తర్వాత వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యం వల్లె రైతులకు సరిపడా యూరియాను అధికారులు పంపిణీ చేయడం లేదన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకొని సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బసంత్, కృష్ణా రెడ్డి, బాలకిష్ట, మతిన్, శ్రీను, హన్మిరెడ్డిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

యూరియాను అందుబాటులో ఉంచాలి

నారాయణపేట: దేశానికి అన్నం పెట్టె అన్నదాతపై పోలీసులు అహంకార పూరితంగా దాడిచేసి కొట్టడం తగదని మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. మరికల్‌లో యూరియా కోసం వచ్చిన రైతుపై ఎస్ఐ చేయి చేసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు శనివారం చివరి రోజు కావడంతో వివిధ గ్రామాల నాయకులు హాజరై అభ్యంతరాలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి రాజకీయ నాయకుల అ భ్యంతరాలను, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తిప్ప య్య, మహాదేవ్, నాయకులు నాగేందర్, ఈశ ప్పగౌడ, సంతోష్‌గౌడ పాల్గొన్నారు.

నకిలీ ఓటర్లను తొలగించాలి

మాగనూర్: ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలో ఉన్నటువంటి డబుల్ ఓటర్లను తొలగించాలని ఆయా రాజకీయ పార్టీల నాయకులు కోరారు. శనివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌తో కలిసి ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు స్పందిస్తూ.. పలు గ్రామాల్లో ఒకే పేరుతో డబుల్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. అదే విధంగా చనిపోయిన ఓటర్లను సైతం తొలగించాలన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

తప్పుల తడకగా జాబితా

ధన్వాడ: మండలంలో ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉండడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఓటర్ల ఫొటోలకు బదులు ఆధార్ కార్డును ముద్రించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి సరి చేయాలని కోరుతున్నారు.

'ముఖ్యమంత్రి గద్దె దిగాలి'

మరికల్: రైతులకు యూరియా పంపిణీ విషయంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మరికల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం నెల రోజుల నుంచి అవస్థలు పడుతుంటే మంత్రి, ఎమ్మెల్యే చూస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించని ఈ ప్రభుత్వానికి పరిపాలన చేసే హక్కు లేదన్నారు. రైతులపై పోలీసులతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో అశోక్, నర్సిములు, అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పీఈటీలకు ఘన సన్మానం



మక్తల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పీఈటీలను వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో మక్తల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సూచన మేరకు వారం పాటు క్రీడ వారోత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో పీఈటీలను సన్మానించి గ్రామ స్థాయి నుంచి మంచి క్రీడాకారులను వెలికి తీయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్‌కుమార్, ఎంఈఓ అనిల్‌గౌడ్, డీఎస్‌ఓ వెంకటేశ్ శెట్టి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, శ్రీహరన్న సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధలింగస్వామి జన్మదినోత్సవం

కృష్ణా: నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి 35వ జన్మదినోత్సవ వేడుకలను భక్తులు మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటిల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు తమ జీవితంలో పరోపకారం, ధానం, ధర్మం, ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం అలవరుచుకుంటే సంతోషకర జీవితాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీరేష్, మాజీ సర్పంచ్ మహాదేవ్, బాల్‌రాజ్, భీమ్, నాగరాజ్, మల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతాయుతమైంది

నారాయణపేట రూరల్: జర్నలిస్టు వృత్తి సమాజంలో ఎంతో బాధ్యతతో కూడుకున్నదని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.గార్డెన్‌లో శనివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజాసేవలో ముందుండాగలరని అందుకే మొదట తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జర్నలిస్టులకు వైద్యసేవలు అందించడం ఎంతో శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎంఏ రషీద్, లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణ్ బట్టడ్, మొల్లన్ జనార్దన్, రవికుమార్ గౌడ్, గందే ఉమాకాంత్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరెడ్డి, శివశంకర్, యూనియన్ వైద్య విభాగ కన్వీనర్ సంజీవ్ కుమార్, విద్యా విభాగం కన్వీనర్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.


కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎస్పీ యోగేష్ గౌతమ్, పక్కన కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కోస్గి రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ క్రీడారంగంలో రాణిస్తున్న విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ దుస్తులను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చన్నారు. అనంతరం పాఠశాలకు గోడ గడియారాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ కృష్ణగౌడ్, కోశాధికారి వెంకట్రాములు, కోడిగంటిహరి, కోటాల శంకర్ , పూర్ణచంద్రయాదవ్, చల్లా శ్రీరాములు, సురేశ్‌గౌడ్, వార్లబాల్‌రాజ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాల్సిందే


మాట్లాడుతున్న సత్యయాదవ్

దామరగిద్ద/నారాయణపేట: నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాల్సిందేనని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావ్‌నామాజీ, పార్టీ జిలా అధ్యక్షుడు సత్యయాదవ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో భూ నిర్వాసిత రైతులు చేపట్టిన 24వ రోజు రిలే దీక్షలకు వారు మద్దతు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి తలుచుకుంటే రైతులకు న్యాయం చేయడం పెద్ద పని కాదన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే రైతుల పక్షాన నిలిచి సీఎంతో చర్చించి రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేసి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు సంజీవగౌడ్, భూ నిర్వాసిత సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపరిహారంపై సమ్మతించని రైతులు

ప్రభుత్వం తరపున కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి రైతుల దీక్షలో పాల్గొని పరిహారం పెంపు విషయమై రైతులతో మాట్లాడారు. సీఎం ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారని చెప్పగా దీనిపై రైతులు విముఖత వ్యక్తం చేశారు.

వర్షాలకు కూలిన ఇళ్లపై విచారణ

మరికల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిన మట్టి ఇళ్లపై శనివారం పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. తెల్లవారు జామున మేకల ప్రసాద్‌కు చెందిన మట్టి ఇళ్లు వర్షానికి అకస్మాతుగా కూలిపోవడంతో ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పంచానామా నిర్వహించారు. వర్షాలకు ఇళ్లు కూలిన వారు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాకు సంబంధించిన జిరాక్స్ పత్రాలకు కూలిన ఇంటి ఫోటోను జతచేసి ఆర్ఐకి ఇస్తే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

నారాయణపేట: నారాయణపేట మున్సిపల్ కమిషనర్ నర్సయ్యను శనివారం బీజేపీ నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ, పట్టణ బీజేపీ అధ్యక్షుడు పోశల్ వినోద్, హిరణ్య గర్భస్వామి, మోగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: మండలంలోని బండగొండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతనంగా కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడు వడ్ల వడ్ల బాలరాజు, ఉపాధ్యక్షుడు బద్రీనాథ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సహ కార్యదర్శి రాజు, కార్యవర్గ సభ్యులుగా అర్జున్ ఎన్నికయ్యారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించా రు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంద నర సింహ, నియోజవర్గ ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై అఖిలపక్ష సమావేశం

మద్దూరు: స్థానిక సంస్థల ఎన్నికల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 206 వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, 26,217 మంది ఓటర్ల జాబితా గురించి అన్ని పార్టీల నాయకులకు ఎంపీడీఓ రహ్మతుద్దీన్ వివరించారు. దీనిపై స్పందించిన అఖిలపక్ష నాయకులు నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో కలిసిన గ్రామపంచాయతీ ఓటర్లు ఇందులో ఉన్నారని వారిని తొలగించాలని సూచించగా తహసీల్దార్‌కు లేఖ రాస్తానని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



నర్వ: ప్రాణకోటికి, పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. శనివారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యులు మహేందర్ పేపర్‌తో తయారు చేసిన పెన్నులను ఈ సందర్భంగా తహసీల్దార్ చేత విడుదల చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్లాస్టిక్ పెన్నులతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహనకు పేపర్‌తో తయారు చేసిన పెన్నులను అధికారులకు, విద్యార్థులకు అందించినట్లు జనవిజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేత

ఊట్కూరు: ఊట్కూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ తరపున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. 500 మార్కులకు పైగా సాధించిన 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1100 చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హనుమంతు, సింగిల్‌విండో అధ్యక్షులు బాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భరత్, శంకర్, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

దళితుల రిజర్వేషన్లు రక్షించుకుందాం

కోస్గి రూరల్: దళితుల రిజర్వేషన్లు దుర్వినియోగం కాకుండా రక్షించడానికి నిత్యం ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్‌తో పాటు కర్నె శ్రీశైలంకు నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు పోకల లక్ష్మణ్, నర్సింములు, అంజయ్య, బుగ్గప్ప, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.